క్లుప్తంగా

సమస్యలు ఉంటే చెప్పండి

ప్రొద్దుటూరు : వీధుల్లో ఏవైనా సమస్యలు ఉంటే తెలపాలని ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున అన్నారు. పట్టణంలోని జిన్నా రోడ్డు మోటు వద్ద ఉన్న కాల్వలో పేరుకుపోయిన చెత్తను కమిషనర్ అధ్వర్యంలో పారిశుధ్య కార్మికులచే సోమవారం చెత్తను తొలగించారు. అలాగే కోనేటి కాల్వ వీధిలో కాలువలో కార్మికులచే శుభ్రం చేపించామని తెలిపారు. అలాగే గోకుల్ నందు ఇంటింటి చెత్త సేకరణ, మంచినీటి సరఫరాలో ఏమైనా సమస్యలు ఉన్నాయని తెలుసుకున్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు, నూర్ బాష పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

పోరుమామిళ్ల : మండలంలోని ఈదుళ్లపల్లె, గురప్పగారిపల్లె పాఠశాలల్లో చదువుతున్న 116 మంది విద్యార్థులకు గురువారం చిత్తా శౌరిరెడ్డి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎఫ్‌సీఎస్ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, థామస్‌రెడ్డి దంపతులు దుస్తులు అందజేశారు. సంస్థ ప్రతినిధులు ప్రసాద్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలను ప్రోత్సహించేందుకు, పండుగల తరుణంలో తల్లిదండ్రులకు సహకారం అందించేందుకు దుస్తులు అందించినట్లు తెలిపారు.

చర్చి నిర్మాణానికి ఎంపీ నగదు వితరణ



నగదును అందజేస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

కాశినాయన : మండలంలోని వడ్డమాను గ్రామంలో నూతన చర్చి నిర్మాణానికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి రూ.50 వేలు స్వంత నిధులను వితరణగా అందజేశారు. సోమవారం పోరుమామిళ్లలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి చేతులమీదుగా రూ.50 వేలును వడ్డమాను గ్రామస్తులకు అందజేశారు. చర్చి నిర్మాణానికి సాయం అందించాలని అడిగిన వెంటనే అందజేసిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఇందుకు సహకరించిన ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు హనుమంతరెడ్డి, వడ్డమాను మాజీ సర్పంచ్ రామయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అసెంబ్లీలో నిలదీస్తారని కూటమి నేతలకు భయం

చాపాడు : కూటమి సర్కారు దోపిడీని, వైఫల్యాలను, సూపర్‌సిక్స్ హామీల అమలును వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రశ్నిస్తే అసెంబ్లీలో జవాబు చెప్పలేమనే భయంతో ప్రతిపక్ష హోదా హోదా ఇవ్వడం లేదని వైఎస్సార్‌సీపీ నేత, ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. సోమవారం రెడ్యం మాట్లాడుతూ..ఒక వైపు జగన్‌ను ప్రతిపక్ష నేతగా గుర్తించకుండా మరో వైపు సాక్షి, ఎన్‌టీవీ, 10టీవీ, టీవీ–9 ఛానెళ్లను సైతం అసెంబ్లీలోకి అనుమతించకుండా తగుదునమ్మా అంటూ టీడీపీ నేతలు ఉత్తర కుమార ప్రగల్భాలు పలుకుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిల కూటమి సర్కార్ వైఫల్యాను ప్రశ్నించకుండా కూటమి సర్కార్ అద్దె మైక్‌లా మారడంతో ప్రజలు చీత్కరిస్తున్నారన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని తగిన సమయంలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

భగవద్గీత ప్రచారం

కాశినాయన : మహాశివరాత్రి పండుగ సందర్భంగా త్రైత సిద్ధాంతం – ప్రబోధ సేవా సమితి, హిందూ విజ్ఞాన వేదిక కంభం కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని బాలరాజుపల్లె, పాపిరెడ్డిపల్లె, ఆనంవారిపల్లె, కోడిగుడ్లపాడు గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలపై ప్రచారం చేశారు. కార్యక్రమంలో నర్రా శ్రీనివాసరెడ్డి, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, లక్ష్మి, శ్రీదేవి, తిరుపతయ్య, రాజ్యలక్ష్మి, బలరామ్, అంజలి, సరస్వతి, మస్తాన్, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితుల ధర్నా



బ్రహ్మంగారిమఠం : మండలంలో మల్లేపల్లె, ముడుమాల గ్రామ పంచాయతీలలో గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణానికి భూములు కోల్పోయిన నిర్వాసితులకు నష్ట పరిహారం చెల్లించాలని సోమవారం మల్లేపల్లెలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శివకుమార్, అన్వేష్‌ల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండేళ్లగా ప్రభుత్వం రోడ్డు పనులు చేస్తున్నా ఇంతవరకు ఇంకా కొంతమంది నిర్వాసితులకు నష్ట పరిహారం ఇవ్వలేదన్నారు. నష్ట పరిహారం ఇచ్చేంత వరకు రోడ్డు పనులు అడ్డుకుంటామంటే బి.మఠం ఎస్‌ఐ చంద్రశేఖర్ సిబ్బందితో వచ్చి కాంట్రాక్టర్లకు మద్దతుగా నిలవడం ఏమిటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి సునీల్‌కుమార్, రైతులు గురవయ్య, నారాయణ, భీముడు, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధుల క్షేత్రం.. భక్తులకు పవిత్రం



ప్రకృతి ఒడిలో వెలసిన సిద్ధవరం సిద్ధేశ్వరస్వామి ఆలయం



సిద్ధేశ్వరుని మూలవిరాట్

- మహాశివరాత్రి ఉత్సవాలకు ఆలయం ముస్తాబు
- జాగరణ చేసే భక్తుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు

పోరుమామిళ్ల : మహాశివరాత్రి పర్వదినానికి శైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. మండలంలోని సిద్దవరం గ్రామానికి కొండమధ్యలో వెలసిన సిద్దులు (సిద్దేశ్వరుడు) క్షేత్రంలో స్వామి వారు భక్తుల విశేష పూజలందుకుంటున్నారు. వందల సంవత్సరాల విశిష్టత ఉన్న ఈ ఆలయానికి మహాశివరాత్రి రోజు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామి దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. ఆలయ సమీపంలో సహజ సిద్ధంగా ఏర్పడిన మంచినీటి కొలను ఏ కాలంలోనూ ఎండిపోకుండా ఉండటం అందరిని ఆశ్చర్యానికి గురిచేస్తోంది. కొండ దిగువన వున్న సిద్దవరంలో సంవత్సరాల తరబడి వేసవి కాలంలో బావులు, బోర్లు ఎండిపోయి నీటి ఎద్దడి ఏర్పడి ప్రజలు తల్లడిల్లినా, కొండపైన కొలను ఎన్నడూ ఎండిపోయిన దాఖలాలు లేవు. పురాతనంగా ప్రాశస్త్యమున్న ఈ స్వామి పేరుతోనే సిద్దవరం గ్రామం ఏర్పడినట్లు తెలుస్తోంది.

ఆలయ పునరుద్ధరణతో పెరిగిన ఆదరణ

పూర్వం ఏనాడో నిర్మించిన చిన్న గుడి శిథిలమవటంతో రెండు దశాబ్దాల క్రితం గ్రామనేత, వైఎస్ఆర్‌సీపీ నాయకుడు జీ.సీ. రమణారెడ్డి దాతల సహకారంతో ఆలయ పునరుద్ధరణకు కృషి చేశారు. దశాబ్దకాలంలో రమణారెడ్డి నేతృత్వంలో ఆలయ ఆవరణ అద్భుతంగా అభివృద్ధి చెందింది. యంత్రాలతో కొండను తొల్చి స్థలం విశాలం చేసి, దాతల సహాయంతో నవగ్రహ మండపం, సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయం, కాశినాయన గుడి, అన్నపూర్ణ దేవి ఆలయం నిర్మించారు. నేరుగా గుడి వద్దకే వాహనాలు వెళ్లేలా దారి ఏర్పాటు చేయడం వల్ల మహిళలు, వృద్ధులు, పిల్లలకు ఇబ్బంది తప్పింది. ఆవరణ విశాలం చేయడంతోపాటు భక్తులకు గదులు నిర్మించి, మంచి సౌకర్యం కల్పించారు. సహజసిద్ధ నీటికొలను కారణంగా తాగునీటి సమస్య ఉత్పన్నం కాకపోయినా ప్రతి సంవత్సరం పెరుగుతున్న భక్తుల సౌకర్యార్థం రమణారెడ్డి బోరు వేయించి నీటికి ఇబ్బంది లేకుండా చేశారు.

మహాశివరాత్రి రోజు ప్రత్యేక కార్యక్రమాలు

ఫిబ్రవరి 26న మహాశివరాత్రిని పురస్కరించుకుని తెల్లవారుజామున నుంచే స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగనున్నాయి. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు ఎంపీటీసీ లక్ష్మీదేవి, ఆమె కుమారుడు హర్షవర్ధన్‌రెడ్డి, అల్లుడు రామ్మోహన్‌రెడ్డిలు పేర్కొన్నారు. ఉదయం పూజా కార్యక్రమాలు, మధ్యాహ్నం పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, సాయంత్రం గ్రామోత్సవం, కోలాటం అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. లింగోద్భవ పూజా కార్యక్రమాలు రాత్రి 11:30 నుంచి 12:30 గంటల మధ్య నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు. రాత్రికి జాగరణ చేసే భక్తులకు ఉత్సాహాన్నిచ్చే రేలా రే రేలా గోపాల్ బృందం జానపద గేయాల కార్యక్రమం, భజనలు ఏర్పాటు చేశారు. సిద్దవరం గ్రామానికి చెందిన గుత్తిరెడ్డి రామసుబ్బారెడ్డి ఆయన కుమారుడు నారాయణరెడ్డి ఈ సంవత్సరం శివరాత్రి ఉత్సవాలకు ఆర్థిక సహకారం అందిస్తున్నారు.

ఉపాధి పని దినాల పెంపులో జిల్లాకు మొండి చేయి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రజా పక్షం పార్టీ నాయకులు

ప్రొద్దుటూరు : జిల్లాకు నిధులు రాకుండా నిర్లక్ష్యం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజా పక్షం పార్టీ అధ్యక్షుడు పుత్తా లక్ష్మిరెడ్డి, సెక్రటరీ అబ్దుల్ రహీం అన్నారు. ప్రొద్దుటూరులో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని కరువు పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ప్రకటించిన కరువు మండలాల్లో ఉపాధి పని దినాలు పెంచుతూ కేంద్రం ఈ నెల 18న ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఇందులో రాయలసీమలోని అన్ని జిల్లాలకు అవకాశం కల్పించినా కడపకు మాత్ర మొండి చేయి చూపిందన్నారు. జిల్లాను కేంద్రం పరిగణనలోకి తీసుకోలేదని తెలుస్తోందన్నారు. పక్కనే ఉన్న సత్యసాయి, అన్నమయ్య, కర్నూలు, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో ఖరీఫ్ 2024 కరువు ప్రభావిత 54 మండలాల్లో ఉపాధి పథకంలో అదనపు పని దినాలను కేంద్రం ఆమోదించినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే 100 పని దినాలు వినియోగించుకున్న కుటుంబాలు మార్చి నెలాఖరులోగా మిగతా 50 రోజుల పని దినాలు ఉపయోగించుకోవచ్చన్నారు. కడపకు జిల్లాకు అవకాశం లేక పోయిందన్నారు. అనంతరం తహసీల్దార్ గంగయ్యకు వారు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేస్తున్న ఎంఈఓ, చిప్పగిరి ప్రసాద్

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ బంగారు భవిష్యత్‌కు బాట వేసుకోవాలని ఎంఈఓ సావిత్రమ్మ పేర్కొన్నారు. స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న 98 మంది విద్యార్థులకు ఆదరణ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో పరీక్షా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు బైసాని సత్యనారాయణ మాట్లాడుతూ సెయింట్ జోసఫ్‌లో 1996లో పదవ తరగతి చదివిన పూర్వవిద్యార్థి డాక్టర్ శ్రీరంజన్ సహకారంతో పరీక్షా సామగ్రిని అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు మాజీ మెంబర్ చిప్పగిరి ప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు గురప్ప, ఉపాధ్యాయుడు నాగరాజు, సంస్థ ప్రధాన కార్యదర్శి మాధవ, రాంబాబు పాల్గొన్నారు.

కార్మికుల పోస్టుకార్డు ఉద్యమం



పోస్టు కార్డులు చూపుతున్న సీఐటీయూ నాయకులు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపల్ కార్మికుల సమస్యలపై సీఎం చంద్రబాబుకు పోస్టుకార్డు ద్వారా పోస్టు రాసి పంపించడమైనదని సీఐటీయూ నాయకులు పేర్కొన్నారు. ఈ పోస్టులని చూసి సీఎం మనసు మార్చుకొని ఆప్కాస్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, నేటి ధరలకు అనుకూలంగా వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సోమవారం ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో 200 మంది పోస్టు ఆఫీస్‌లో పోస్టు ద్వారా అందరు రాసి పంపించారని తెలిపారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి సాల్మోను, జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ విజయకుమార్, పట్టణ కోశాధికారి రాఘవేంద్ర, పట్టణ వర్కింగ్ ప్రసిడెంట్ రవికుమార్, ఉపాధ్యక్షులు గుర్రమ్మ, ప్రమీలమ్మ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు అర్బన్ : ఆప్కాస్ సంస్థను రద్దు చేయాలని ఇటీవల జరిగిన మంత్రి మండలి సమావేశంలో కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకుని కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబుకు పోస్టుకార్డులు పంపారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.నాగేంద్రబాబు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కార్మికులకు సకాలంలో జీతాలు అందేవన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఈ నెల 6న జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆప్కాస్ సంస్థను రద్దు చేయనున్నట్లు ప్రకటించడం ద్వారా పొరుగు సేవల కార్మికుల్లో భయాందోళనలు నెలకొన్నాయన్నారు. వెంటనే ఆప్కాస్‌ను పునరుద్ధరించి కార్మికులకు బాసటగా నిలవాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు.

పట్టుదలతో చదివితే మంచి ఫలితాలు

బద్వేలు అర్బన్ : పట్టుదల, ఆత్మవిశ్వాసంతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ (ఏఎస్‌డబ్ల్యూఓ) రామయ్య పేర్కొన్నారు. స్థానిక సిద్దవటం రోడ్డులోని ఎస్సీ బాలుర వసతిగృహం–2లో నియోజకవర్గంలోని ఎస్సీ వసతి గృహంలో పది విద్యార్థులకు సోమవారం ప్రేరణ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలకు గడువు దగ్గరపడుతున్న నేపథ్యంలో సమయం వృథా చేసుకోకుండా కష్టపడి చదవాలని సూచించారు. శిక్షణా తరగతుల్లో సూచించిన మెళకువలను పాటిస్తూ ప్రతి సబ్జెక్టులో నైపుణ్యాన్ని మెరుగుపరుచుకుని పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. చదువుకు పేద, ధనిక అనే భేదం లేదని, పట్టుదలతో చదివి తల్లిదండ్రులకు, హాస్టల్‌కు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో వసతిగృహం సంక్షేమాధికారులు సుభాష్, మధు, హరికృష్ణ, బాలరాజు, విజయమ్మ, లక్ష్మిదేవి, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

చదువుతో పాటు మంచి నడవడిక అవసరం

బద్వేలు అర్బన్ : ప్రతి విద్యార్థికి చదువుతోపాటు మంచి నడవడిక అవసరమని, ఈ లక్షణమే మనిషిని ఉన్నత స్థాయిలో నిలబెడుతుందని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.సుబ్బారెడ్డి, పద్మావతి హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ వి.మురళీధర్‌రెడ్డిలు పేర్కొన్నారు. రాచపూడి నాగభూషణం ఒకేషనల్ జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలను సోమవారం ఎస్‌ఆర్‌ఎస్‌బీ ఫంక్షన్ హాలులో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ ఒకేషనల్ విద్య వలన చిన్న వయస్సులోనే ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించడానికి ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో సంజీవని హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ వి.సుమన్‌కోట, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వై.సరస్వతి, మోటివేషనల్ స్పీకర్ కె.కృష్ణ, రాచపూడి నాగభూషణం విద్యాసంస్థల పరిపాలనాధికారి రాచపూడి సాయిక్రిష్ణ, వేంకటేశ్వర వెటర్నరీ కళాశాల అధ్యాపకులు ఆచార్య సాయిదిలీప్ గుప్తా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

కాశినాయన : మండలంలోని నల్లమల్ల అడవుల్లో వెలసిన బెలూమ్ గుహల్లో మహాశివరాత్రి పండుగ ఉత్సవాలకు ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మైదకూరు – పోరుమామిళ్ల రహదారిలో దూదెమ్మకోన నుంచి బెలూమ్ గుహలకు భక్తులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు. భక్తులకు తాగునీరు, భోజన వసతి ఏర్పాటు చేశామన్నారు. దట్టమైన అభయారణ్యంలో మునీశ్వరులు తపస్సు చేసిన పుణ్య స్థలం బెలూమ్ గుహలని వారు పేర్కొన్నారు. శివరాత్రి ఉత్సవాలకు బెలూమ్ గుహలకు వచ్చే భక్తులు అడవి మార్గంలో రావాల్సి ఉంటుందని, భక్తులు అడవికి నిప్పు పెట్టకుండా రావాలని వారు కోరారు.

నేటి నుంచి బ్రహ్మంగారి కల్యాణ మహోత్సవాలు

బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి మఠంలో మంగళవారం నుంచి బ్రహ్మంగారి కల్యాణ మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. మార్చి 1 వరకు ఈ ఉత్సవాలను నిర్వహించేందుకు నిర్వాకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మహాశివరాత్రి సందర్భంగా బుధవారం రాత్రికి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవింద మాంబల కల్యాణం నిర్వహిస్తారు. కల్యాణం తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొననున్నారు.

చిన్నగురువళూరులో గడ్డివామి దగ్ధం

చాపాడు : మండల పరిధిలోని చిన్నగురువళూరు గ్రామంలో సోమవారం మధ్యాహ్నం శివశంకర్ అనే రైతుకు చెందిన గడ్డివామి దగ్ధమైంది. శివశంకర్‌కు చెందిన 1.50 ఎకరాల్లోని వరి గడ్డి వామికి గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టారు. గుర్తించిన స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా సంఘటనా స్థలానికి వారు చేరుకుని మంటలను ఆర్పారు. ఘటనలో రూ.40వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.

రేపు శివపార్వతుల కల్యాణోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : పెన్నానదీ తీరంలోని శ్రీ అమృతేశ్వరస్వామి ఆలయంలో బుధవారం శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు కొవ్వూరు రమేష్‌రెడ్డి, పీఆర్‌ఓ ధారా సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం మరకతలింగానికి కాశీజలాభిషేకం, ద్వాదశ జ్యోతిర్లింగాలకు, అష్టాదశ శక్తిపీఠాలకు విశేష పూజలు, జపహోమాదులు, సాయంత్రం 6 గంటలకు శివపార్వతుల కల్యాణోత్సవం, అన్నప్రసాద వినియోగం, రాత్రి 10.30కు మహాన్యాస పారాయణం, 12 గంటలకు లింగోద్భవ సమయంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించి తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

నేడు ఉచిత వైద్య శిబిరం



డాక్టర్ సురేష్

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక గాంధీరోడ్డులోని చౌడేశ్వరి గుడి వీధిలో ఉన్న గౌతమ్ హాస్పిటల్స్ 15వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం చర్మవ్యాధులు, గర్భిణులకు ఉచితంగా ఓపీ నిర్వహించనున్నట్లు హాస్పిటల్ వైద్యులు సురేష్, సుజన ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ఓపీ ప్రారంభమవుతుందని వారు పేర్కొన్నారు. ప్రొద్దుటూరు, పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శివరాత్రి ఉత్సవాలకు గట్టి భద్రతా చర్యలు



ఆలయ నిర్వాహకులతో చర్చిస్తున్న ట్రైనీ డీఎస్పీ భవానీ

చాపాడు : మహాశివరాత్రి ఉత్సవాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గట్టి భద్రతా చర్యలు చేపట్టనున్నట్లు ట్రైనీ డీఎస్పీ భవానీ పేర్కొన్నారు. మండలంలోని అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవస్థానం వద్ద సోమవారం శివరాత్రి ఉత్సవ ఏర్పాట్లను ఎస్‌ఐ చిన్న పెద్దయ్య, ఉత్సవ కమిటీ చైర్మన్ పెరుగు వీరనారాయణ యాదవ్, ఆలయ ఈఓ శ్రీనివాసులతో కలసి ట్రైనీ డీఎస్పీ పరిశీలించారు. స్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భారీకేడ్లను ఏర్పాటు చేసి మంచినీటి సౌకర్యం కల్పించాన్నారు. ఆలయానికి అన్ని వైపులా నుంచి వచ్చే భక్తులు తమ వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు వీలుగా స్థలం ఏర్పాటు చేయాలని సూచించారు. ఎలాంటి అసౌకర్యం కలుగకుండా విద్యుత్ సరఫరా ఉండేలా ట్రాన్స్ కో అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

భక్తిని పెంచేందుకు శ్రీకృష్ణ రథయాత్ర



రాజుపాళెంకు చేరుకున్న శ్రీకృష్ణ బలరామ దేవుల రథయాత్ర

రాజుపాళెం : ప్రజల్లో భక్తి భావాన్ని పెంచేందుకు ఆధ్యాత్మికంగా ముందుకు సాగాలని ప్రొద్దుటూరు అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో సోమవారం సంచార పాదయాత్ర నిర్వహించారు. ప్రొద్దుటూరు పట్టణం నుంచి ప్రారంభమైన సంచార పాదయాత్రలో భాగంగా శ్రీకృష్ణ బలరామ దేవుల విగ్రహాలను రథంలో ఏర్పాటు చేశారు. ఆ రథాన్ని లాగేందుకు గుజరాత్ నుంచి తీసుకొచ్చిన ప్రత్యేక వృషభ రాజములతో ఈ యాత్ర ప్రారంభమైంది. గోపవరం, రాజుపాళెం, వెంగలాయపల్లె, పగిడాల మీదుగా పుణ్యక్షేత్రమైన వెల్లాలకు చేరుకుంది. ఇక్కడ కొలువై ఉన్న శ్రీ చెన్నకేశవ, సంజీవరాయస్వామి ఆలయ వద్ద నుంచి నగర సంకీర్తనల మధ్య రథయాత్ర సాగింది. ప్రజలు శ్రీకృష్ణ బలరామ దేవులను దర్శించుకున్నారు. రాత్రి వెల్లాలలో బస అనంతరం మంగళవారం అర్కటవేముల గ్రామంలో సంచార పాదయాత్రను నిర్వహించనున్నట్లు వారు చెప్పారు. ఏప్రిల్ నెలలో శ్రీరామనవమి పురస్కరించుకొని నంద్యాల జిల్లాలోని పుణ్యక్షేత్రమైన అహోబిలం మీదుగా తిరుపతి వరకు సంచార పాదయాత్ర ఉంటుందని భక్త బృందం సభ్యులు తెలిపారు.

నేటి నుంచి మల్లెం కొండేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



భక్తులు దర్శించుకోనున్న మల్లెంకొండేశ్వరస్వామి

గోపవరం : మండలంలోని మల్లెంకొండేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి గురువారం వరకు మూడు రోజులపాటు నిర్వహించనున్నట్టు ఆలయ పాలకమండలి సభ్యులు, దేవదాయ అధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్టు పేర్కొన్నారు. దాతల సహాయంతో కొండపైన తాగునీరు, జనరేటర్ సౌకర్యం, అన్నదానం కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. బ్రహ్మోత్సవాలకు వైఎస్సార్ జిల్లాతోపాటు నెల్లూరు, ప్రకాశం, కర్నూలు జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరానున్నారు. బద్వేలు రూరల్ ఎస్‌ఐ శ్రీకాంత్ బ్రహ్మోత్సవాల సందర్భంగా కొండపైన గట్టి బందోబస్తు నిర్వహించనున్నారు. బద్వేలు నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనుందని అధికారులు తెలియజేశారు. దాదాపు 35 వేల నుండి 40 వేల వరకు భక్తులు రావచ్చని అధికారులు అంచనా వేశారు. అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు పూర్తి చేశారు. కాగా సోమవారం ఉత్సవాలకు ఆలయం వద్ద భక్తులకు చేస్తున్న ఏర్పాట్లను దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ జి.మల్లికార్జున ప్రసాద్ పరిశీలించారు. బద్వేలు ఈఓ ఎస్.రామలింగారెడ్డితో కలిసి మల్లెంకొండ దిగువ భాగాన భక్తుల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలను ఆలయ కమిటీ, అధికారులను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

శ్రీకృష్ణాలయం అభివృద్ధికి కృషి



శ్రీకృష్ణాలయ యాదవ సేవా సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

ప్రొద్దుటూరు కల్చరల్ : శ్రీకృష్ణాలయం అభివృద్ధికి కృషి చేస్తామని శ్రీకృష్ణాలయ యాదవ సేవా సంఘం నూతన అధ్యక్షుడు దాసరి బాల సుబ్బరాయుడు యాదవ్, కార్యదర్శి ఆర్.వెంకట రమణ యాదవ్ పేర్కొన్నారు. శ్రీకృష్ణాలయంలో సోమవారం సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం వ్యవస్థాపక గౌరవ అధ్యక్షుడు నాళి కృష్ణారెడ్డి యాదవ్, పామిడి రామసుబ్బయ్య యాదవ్, రిటైర్డ్ డీఎస్పీ ఎస్.సుబ్బారెడ్డి యాదవ్, బత్తల చిన్ననాగన్న యాదవ్‌ల ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. సంఘం గౌరవాధ్యక్షునిగా చల్లారాజగోపాల్ యాదవ్, అధ్యక్షునిగా దాసరి బాలసుబ్బరాయుడు యాదవ్, కార్యదర్శిగా ఆర్.వెంకట రమణయాదవ్, కోశాధికారిగా ఆర్.వెంకటయ్య యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యాదవ సేవా సంఘం సభ్యులు, యాదవులు పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

ప్రొద్దుటూరు : మూడు దశాబ్దాల కిందట ప్రారంభించిన తెలుగు గంగ, గాలేరు నగరి, హంద్రీనీవా, వెలుగోడు ప్రాజెక్టులు నేటికీ పూర్తి కాలేదని, ఇది రాయలసీమ పాలకులు అనుసరిస్తున్న నిర్లక్ష్యానికి నిదర్శనమని ప్రొద్దుటూరు సీపీఐ ఏరియా సమితి పేర్కొన్నారు. సాధారణంగా రాయలసీమలో వర్షపాతం చాలా తక్కువగా పడుతోందని, ప్రతి మూడు సంవత్సరాలకు ఓ సారి కరువు వచ్చి రైతులు అనేక ఇబ్బందులకు గురౌతున్నారన్నారు. దీంతోపాటు జీవనోపాధి కోసం రైతులు, రైతు కూలీలు పట్టణాలకు, నగరాలకు వలస పోతున్న దుస్థితి మనం కళ్లారా చూస్తున్నామన్నారు. అయినా ప్రభుత్వం పెద్దపెద్ద వాగ్దానాలు చేయడమే తప్ప పనులు అంగులం కూడా కదలడం లేదన్నారు. రిజర్వాయర్లలో నీళ్లు ఉన్నప్పటికీ పంట పొలాలకు పారించుకోలేని పరిస్థితి ఉందన్నారు. తక్షణమే రాష్ట్ర బడ్జెట్‌లో పది వేల కోట్లు కేటాయించి డిస్ట్రిబ్యూటరీ చానల్స్ మీద దృష్టి పెట్టాలని చెప్పారు. అలాగే త్వరితగతిన పూర్తి చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా సమితి సభ్యులు శివారెడ్డి, రామకృష్ణ, హరి, చంద్రశేఖర్, శ్రీను, మద్దిలేటి, ప్రమీల, సుజాత పాల్గొన్నారు.

సీమ ప్రాజెక్టులు పూర్తి చేయండి

ప్రస్తుత ప్రభుత్వం రాయలసీమలోని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయకుండా, డ్యాములు కట్టకుండా గోదావరి నుంచి రాయలసీమకు నీళ్లు తెస్తామని, గోదావరి నీళ్లను పెన్నాకు తరలిస్తామని చెప్పడం దారుణమని ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆయన సోమవారం మాట్లాడుతూ గోదావరి నీళ్లు బనకచర్లకు రావాలంటే దాదాపు రూ.50 వేల కోట్లు ఆంధ్ర ప్రాంతంలో పెట్టుబడి పెట్టి నీళ్లు నింపి మూడవ దశలో మాత్రమే రాయలసీమకు వస్తాయని అన్నారు. ఇంకొక ప్రాజెక్టు విషయాన్ని పరిశీలిస్తూ గోదావరి నీళ్లను పెన్నానదికి తరలిస్తామని చెప్పడం కూడా మోసపూరిత చర్యని, పెన్నానది ఉండేది రాయలసీమలో కానీ నెల్లూరులో కాదన్నారు. కానీ పెన్నానది చివర అయిన సోమశిల డ్యామ్‌లో గోదావరిని కలపడం దుర్మార్గమైన చర్య అని, రాయలసీమను ఇలా పదేపదే మోసం చేయడం తగదన్నారు. రాయలసీమ మీద చిత్తశుద్ధి ఉంటే గాలేరు నగరి లాంటి ప్రాజెక్టులు పూర్తి చేయాలని, రాయలసీమ అడుగుతున్న ప్రాజెక్టులు అయినా గుండ్రేవుల తుంగభద్ర సమాంతర కాలువ లాంటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని వేడుకుంటున్నామని చెప్పారు.